సిరిసిల్లలోని మార్చుల వద్ద రోధిస్తున్న శ్రీనివాస్ కూతురు రమ్య

ఎంతపని జేసినవు బాపు..

- మీరు తట్టుకోలేరనే నా బాధలు చెప్పకోలేదే..
- తండ్రిని తలుచుకుంటూ తల్లడిల్లిన తనయ
- బొప్పాపూర్‌లో విషాదం..
- కొడుకు ఫిర్యాదుతో అత్తారింటి వారిపై కేసు

శ్రీనివాస్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 24: 'మీరు తట్టుకోలేరనే నా బాధలు చెప్పుకోలేదే బాపు.. తోడబుట్టినోనికి చెప్పినా బాధపడ్తరని అనుకున్ననె.. ఎంతపని జేసినవు బాపు'.. అంటూ తన బాధలు తట్టుకోక బావిలో పడి మృతిచెందిన తండ్రిని తలుచుకుని తనయ రోధించింది. ఈ విషాదకర ఘటన బొప్పాపూర్‌లో పలువురినీ కంటతడి పెట్టించింది. వివరాల్లోకి వెళ్తే.. అత్తింటివారు పదకొండేండ్ల నుంచి తన కూతురును ఇబ్బంది పెడుతున్నారని బొప్పాపూర్‌కు చెందిన అగుల్ల శ్రీనివాస్ గత శనివారం తన అల్లుడు శ్రీకాంత్, అతడి కుటుంబ సభ్యులపై ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో పోలీసులతో ఫోన్ చేయించి పిలిపించే ప్రయత్నం చేసినప్పటికీ వారు రాకపోవడంతో మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం 6గంటలకు బావిలోంచి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం కోసం పంపించారు. విషయం తెలుసుకున్న వెంటనే కూతురు రమ్య అక్కడికి చేరుకోని బోరున విలపించింది. తన సోదరి రమ్యను అత్తింటివారు చిత్రహింసలకు గురిచేయడంతో మనస్తాపం చెంది తన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడని శ్రీనివాస్ కొడుకు రాజు ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రమ్య భర్త శ్రీకాంత్, అత్తామామలు లక్ష్మీ-వీరభద్రయ్య, మరిది ప్రశాంత్, కుటుంబ సభ్యులు పద్మ, సతీశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

సబ్‌స్టేషన్ ఆపరేటర్ సస్పెన్షన్

నమస్తే ఎఫెక్ట్

కోనరావుపేట, సెప్టెంబర్ 24: మద్యం మత్తులో విద్యుత్ సరఫరా నిలిపివేసి వీరంగం సృష్టించిన ఆపరేటర్ పాషాను విద్యుత్ అధికారులు సస్పెండ్ చేశారు. సోమవారం నమస్తే తెలంగాణ దినపత్రికలో 'మద్యం మత్తులో విద్యుత్ సరఫరా నిలిపివేత' అనే శీర్షికన వార్త ప్రచురితం కాగా, టీజీ ఎన్‌పీడీఎస్ఎల్ ఏడీ ప్రదీప్, ఏఈ శ్రీనివాస్‌రెడ్డి బావుసాయిపేట గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. పూర్తి స్థాయిలో విద్యుత్ సబ్‌స్టేషన్, గ్రామంలో వివరాలను సేకరించి పాషా అనే ఆపరేటర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం సబ్‌స్టేషన్‌ను నడిపించేందుకు ఇన్‌చార్జి ఆపరేటర్‌ను నియమించినట్లు వారు తెలిపారు.

మన రాజన్న లడ్డూ స్వచ్ఛమే..

- విజయ డెయిరీ నెయ్యి వినియోగం
- ఆలయ అధికారులకు ఇటీవలే ప్రభుత్వ ఉత్తర్వులు
- ప్రసాదానికి ధోకా లేదంటున్న అధికారులు

వేములవాడ రాజన్న లడ్డు ప్రసాదం

వేములవాడ, సెప్టెంబర్ 24: తిరుమల తిరుపతి తర్వాత వేములవాడ రాజన్న ఆలయ లడ్డూ ప్రసాదానికి కూడా అంత పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజన్న ఆలయంలోనూ ప్రసాదం తయారీలోనూ నెయ్యి వాడకం టన్నుల్లోనే ఉంటుంది. ఇక తిరుమల తిరుపతి ప్రసాదం నెయ్యిపై వివాదం నెలకొనగా రాజన్న ఆలయ ప్రసాదంలోని నెయ్యి భద్రతపై ఆందోళన ఉండగా, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విజయ డెయిరీ నెయ్యిని కొనుగోలు చేయాలని రాష్ట్రంలోని దేవాలయాలకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే వేములవాడ రాజన్న ఆలయానికి గడిచిన పది రోజులుగా విజయ డెయిరీ నెయ్యిని సరఫరా చేస్తున్నారు. అయితే, రాజన్న ఆలయ ప్రసాదాలకు వినియోగించే నెయ్యిపై ఢోకా లేదని ఆలయ అధికారులు భరోసానిస్తున్నారు.

నెలకు 12,15 టన్నుల వినియోగం

రాజన్న ఆలయ లడ్డూ ప్రసాదానికి భక్తులు అత్యంత ప్రీతిపాత్రులు. స్వామివారి ఆలయంలో రెండు రకాల లడ్డూలు తయారు చేస్తుంటారు. అందులో భక్తులకు సాధారణ రూ.20 లడ్డూ, రూ.100కు అభిషేకం లడ్డూ తయారు చేస్తుంటారు. ఇవే కాకుండా స్వామి వారి ఆలయంలో సిరాప్రసాదం తయారీకి కూడా నెయ్యిని వినియోగిస్తుంటారు. స్వామి వారి సన్నిధిలో తయారయ్యే ప్రతి ప్రసాదంలో తగిన మోతాదులో నెయ్యి వినియోగం ఉంటుందని ఆలయ అధికారులు వెల్లడించారు. అయితే, ప్రసాదాల్లో వినియోగించే నెయ్యి ప్రతి నెలా సుమారు 12 నుంచి 15 టన్నులు వినియోగిస్తున్నట్లు గోదాం పర్యవేక్షకుడు సంతోష్ తెలిపారు. గతంలో కరీంనగర్ డెయిరీ కిలో రూ.610కు సరఫరా ఉండేదని, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో విజయ డెయిరీ నెయ్యి కిలో రూ.609కు ఆలయానికి అందిస్తున్నారని వెల్లడించారు. స్వామివారికి సరఫరా అయ్యే నెయ్యికి ఎలాంటి ఢోకా లేదని ఆయన చెప్పారు. అయినప్పటికీ రెండు మూడు రోజుల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులకు తామే స్వయంగా శాంపిల్‌ను పంపిస్తామని స్పష్టం చేశారు.

కేటీఆర్ సేన మండల ఉపాధ్యక్షుడిగా కరెడ్ల మల్లారెడ్డి

ముస్తాబాద్, సెప్టెంబర్ 24 : కేటీఆర్ సేన ముస్తాబాద్ మండల ఉపాధ్యక్షుడిగా చీకోడ్ గ్రామానికి చెందిన కరెడ్ల మల్లారెడ్డిని నియమించిన కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేటీఆర్ సేన ముస్తాబాద్ గ్రామాధ్యక్షుడిగా గడ్డమేని సతీశ్, ఉపాధ్యక్షులుగా కొమ్మెట శ్రీనివాస్, కార్యదర్శిగా భాను, ప్రధాన కార్యదర్శిగా నితిన్, సంయుక్త కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా రాజు, సోషల్ మీడియా వారియర్‌గా రాజు, ఇన్‌చార్జిగా సంతోష్‌ను నియమించినట్లు మనోహర్, వంగరి దిలీప్ తెలిపారు.

ఎస్సారార్‌కు స్వల్ప ఇన్‌ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబర్ 24: మాన్వాడ శ్రీరాజరాజేశ్వర జలాశయానికి మంగళవారం ఎస్సారెస్పీ నుంచి 2,500 క్యూసెక్కులు, వరద ద్వారా 140 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్లు జలాశయం ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. జలాశయం సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను 24.05 టీఎంసీలు నిలువ ఉన్నట్లు వారు తెలిపారు.

30న హుండీల లెక్కింపు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 24: సిరిసిల్ల పట్టణంలోని దేవాదాయ శాఖ పరిధిలో గల పలు ఆలయాల హుండీల లెక్కింపును ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు ఈవో మారుతీ రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు పోచమ్మ ఆలయం, 11.30గంటలకు శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి, మధ్యాహ్నం 1గంటకు శ్రీ విశ్వనాథస్వామి ఆలయం, 2.30గంటలకు శ్రీ శివసాయిబాబా దేవస్థానం హుండీల లెక్కింపు ఉంటుందని తెలిపారు.

ఇల్లంతకుంటలో భారీ వర్షం

ఇల్లంతకుంట, సెప్టెంబర్ 24 : మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో మక్క, పత్తి రైతులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ

కోనరావుపేట,సెప్టెంబర్ 24: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ పాఠశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి వంగపల్లి ప్రవీణ్ హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలోని అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలో ప్రతిభ కనబర్చాడు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వనపర్తి మల్లేశం, వ్యాయామ ఉపాధ్యాయులు బొల్లం వెంకటేశ్ ప్రవీణ్‌ను అభినందించారు.

వాహనదారుడిపై కోతుల దాడి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 24: మండల కేంద్రానికి చెందిన మహ్మద్ అమ్జద్ సోమవారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద నాలుగు కోతుల దాడిచేసి గాయపర్చాయి. బాధితుడు తెలిపిన ప్రకారం, సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో నమాజ్ చేసుకునేందుకు బైక్‌పై వెళ్తుండగా ప్రహరీపైనున్న కోతులు అమ్జద్‌పై దూకాయి. బైక్ అక్కడే పడేసి పరుగెత్తినప్పటికీ నాలుగు కోతులు వెంటపడి దాడి చేశాయి. స్థానిక యువకులు అడ్డుకోగా వారిని సైతం వెంబడించగా భయంతో పరుగులు తీశారు. సిరిసిల్ల ఏరియా హాస్పిటల్‌లో చికిత్స తీసుకున్నట్లు బాధితుడు తెలిపాడు.

రాజన్నపేటలో 'స్వచ్ఛతాహీసేవా'

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 24: రాజన్నపేటలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీసేవా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల శుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇక్కడ మాజీ ప్రజాప్రతినిధులు, బ్యాంకు అధికారులున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ముస్తాబాద్, సెప్టెంబర్ 24 : ఈనెల 14 నుంచి 28వ తేదీ వరకు సిరిసిల్ల కోర్టులో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ గణేశ్ మంగళవారం పేర్కొన్నారు. ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రజలకు ఏమైనా కేసులుంటే న్యాయమూర్తుల సమక్షంలో పూర్తిగా క్లోజ్ చేయడం జరుగుతుందని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, సెప్టెంబర్ 24 : సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)లో కానిస్టేబుల్ ఉద్యోగాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల శాఖాధికారి అజ్మీరా రాందాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఐఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్ (ఫైర్)-2024 పోస్టుల భర్తీకి సంబంధించి రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ వెలువడినట్లు తెలిపారు. ఈనెల 30లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని అజ్మీరా రాందాస్ కోరారు.

పంటల సాగుపై అవగాహన

చందుర్తి, సెప్టెంబర్ 24: యాసంగి అపరాల పంటల సాగుపై వ్యవసాయ శాఖాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. పంటల యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ నిపుణులతో రైతులకు అవగాహన కల్పించారు. ఇక్కడ వ్యవసాయాధికారి దుర్గరాజు, ఏఈవో రమ్య, శారద, యోగేశ్వర్, ప్రవీణ్, రైతులున్నారు.

నేతన్నలకు ఉపాధి లభించేలా చర్యలు తీసుకోవాలి

- జౌళిశాఖ ఏడీ సాగర్‌కు వినతి

జౌళిశాఖ ఏడీ సాగర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు మూషం రమేశ్, తదితరులు

కలెక్టరేట్, సెప్టెంబర్ 24 : ప్రభుత్వం అందించే చీరల ఆర్డర్ డిజైన్లను వార్పిన్ మిషన్లపై బీములు పోయించి కార్మికులకు పూర్తిస్థాయిలో ఉపాధి లభించేలా చూడాలని ప్రభుత్వాన్ని పాలిస్టర్ వార్పిన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కోరారు. ఈ మేరకు మంగళవారం యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యనారాయణ, కార్యదర్శి మూషం రమేశ్ ఆధ్వర్యంలో చేనేత జౌళిశాఖ ఏడీ సాగర్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం రమేశ్ మాట్లాడుతూ, ప్రభుత్వం పవర్‌లూం వస్త్ర పరిశ్రమపై ఆధారపడిన కార్మికులకు ఉపాధి కల్పించడంలో భాగంగా చీరల ఆర్డర్లను అందిస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. చీరె ల వస్త్రానికి సంబంధించిన డిజైన్లను రూపొందించడం జరుగుతుందని తెలిసిందని ఈ డిజైన్లను పవర్‌లూం పరిశ్రమ స్థితిగతులకు అనుగుణంగా రూపొందిస్తే కార్మికులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. వార్పిన్ మిషన్లపై బీములు పోయించేలా డిజైన్లను రూపొందించి పవర్‌లూం వస్త్ర పరిశ్రమకు అనుబంధంగా పనిచేస్తున్న 300 మంది వార్పిన్ కార్మికులు, వారి కుటుంబాలకు ఉపాధి కల్పించిన వారవుతారన్నారు. ఇక్కడ ఉడుత రవి, డీ రమేశ్, ఎం మహేశ్, తదితరులున్నారు.

మందుబాబుల అడ్డాగా పాఠశాల

- స్కూలు ఆవరణలో బీరు సీసాలు
- పాఠశాలను సందర్శించిన డీఈవో
- సీసీ కెమెరాలను బిగించాలని సూచన

బండలింగపల్లి హైస్కూల్ ఆవరణలో ఖాళీ బీరు సీసాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 24: పవిత్రంగా ఉండే బడి ఆవరణ మందు బాబుల అడ్డాగా మారింది. యథేచ్ఛగా మద్యం తాగుతూ అక్కడే ఖాళీ సీసాలను పడేసి కలుషితం చేస్తున్నారు. బండలింగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం రాత్రి మందు బాబులు బీరు తాగి ఖాళీ బాటిళ్లను అక్కడే పడేసి వెళ్లారు. మంగళవారం విద్యార్థులు పాఠశాలకు చేరుకునే సరికి బీరుబాటిళ్లు దర్శనమిచ్చాయి. కొందరు స్థానికులు ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టగా వైరల్‌గా మారాయి. సమాచారం తెలుసుకున్న డీఈవో రమేశ్‌కుమార్ పాఠశాలను సందర్శించి ఆవరణలో సీసీ కెమెరాలను బిగించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కాలేయ వ్యాధితో ఒకరి మృతి

విష్ణు (ఫైల్)

కోనరావుపేట, సెప్టెంబర్ 24: మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన శ్రీరామోజు విష్ణు(42) కాలేయ వ్యాధితో మృతి చెందాడు. విష్ణు ఇంటి వద్దనే కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో ఉన్నట్టుండి సోమవారం అస్వస్థతకు గురికాగా కరీంనగర్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాలని సూచించగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. విష్ణు మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. విష్ణుకు భార్య సమత, కూతురు, కొడుకు ఉన్నారు. విష్ణు బీఆర్ఎస్ కార్యకర్తగా చురుకుగా పనిచేశాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

కోనరావుపేట, సెప్టెంబర్ 24: రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని ఎప్పుడు నియమిస్తారని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూజం కార్తిక్ ప్రశ్నించారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్నా ఇప్పటివరకు మంత్రులను నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. మద్యం మంత్రి కావాలి కానీ విద్యాశాఖ మంత్రి వద్దా అని ఎద్దేవా చేశారు. మద్యం మీద ఉన్న పట్టింపు విద్యపై ఎందుకు లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రిని నియమించి స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ పలువురు ఏబీవీపీ నాయకులున్నారు.

లడ్డూను అపవిత్రంపై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 24: తిరుపతి లడ్డూను అపవిత్రం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయకమిటీ, సత్సంగ సదనం సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం తిరుపతి లడ్డూను అపవిత్రం చేసిన ఘటనపై నిరసనగా నగర సంకీర్తన చేపట్టారు. ఇక్కడ ఆలయ కమిటీ అధ్యక్షుడు గడ్డం జితేందర్, నంది కిషన్, ముత్యాల ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

జాతీయస్థాయి ట్రిక్కింగ్ పోటీలకు బడితండా విద్యార్థి ఎంపిక

అనిల్ (ఫైల్)

రుద్రంగి, సెప్టెంబర్ 24: జాతీయస్థాయి ట్రెక్కింగ్ పోటీలకు రుద్రంగి మండలం బడితండా గ్రామానికి చెందిన విద్యార్థి మాలోత్ అనిల్ మంగళవారం ఎంపికయ్యారు. బడితండా గ్రామానికి చెందిన మాలోత్ అనిల్ కరీంనగర్‌లోని ఎస్సారార్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. ఇటీవల శాతవాహన యూనివర్సిటీ పరిధిలో జరిగిన రాష్ట్ర స్థాయి ట్రెక్కింగ్ పోటీల్లో మాలోత్ అనిల్ ఉత్తమ ప్రతిభ కనభరిచి అక్టోబర్ 22న హిమాచల్ ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో మండల ప్రజలు, ఉపాధ్యాయులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఓటరు నమోదు కట్టుదిట్టంగా నిర్వహించాలి

కలెక్టరేట్, సెప్టెంబర్ 24: రాష్ట్రంలో ఓటరు నమోదు కార్యక్రమం కట్టుదిట్టంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, స్పెషల్ సమ్మరీ రివిజన్, ఈఆర్‌వో నెట్ 2.0పై జిల్లాల కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ, నూతన ఓటరు నమోదుపై చేపట్టిన ఇంటింటా సర్వే ఇప్పటివరకు 90 శాతం పైగా పూర్తయిందని, సెప్టెంబర్ 28 నాటికి వంద శాతం పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్లు, తహసీల్దార్లు షరీఫ్, మహేశ్, ఎన్నికల డీటీ పాషా తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సభ్యులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 24: దుమాలకు చెందిన న్యాలకొండ రాకేశ్ రెడ్డి ఇటీవల గణపతి నిమజ్జనం రోజు ట్రాక్టర్ కింద పడి మృతి చెందగా సదరు కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ వాట్సాప్ గ్రూప్ సభ్యులు సాయం అందించారు. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.87 వేలు నగదును అందజేశారు. ఇక్కడ జంగ సంజీవరెడ్డి, కదిరె శ్రీనివాస్, గుల్లపల్లి నర్సింహారెడ్డి, కొలనూరి శంకర్, రేండ్ల హన్మంతు తదితరులున్నారు.

ఎస్ఐ రామ్మోహన్‌కు సన్మానం

ఎస్ఐ రామ్మోహన్‌ను సన్మానిస్తున్న మాజీప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 24: తంగళ్లపల్లి ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన రామ్మోహన్‌ను మంగళవారం మండేపల్లికి చెందిన మాజీప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు కలిశారు. ఈసందర్భంగా శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. ఇక్కడ మాజీ సర్పంచ్ గనప శివజ్యోతి, మాజీ ఎంపీటీసీ బుస్స స్వప్న, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గనప మదన్‌రెడ్డి, బుస్స లింగం, రాములు, కృష్ణారెడ్డి, భాస్కర్ తదితరులున్నారు. అలాగే, ఎస్ఐ రామ్మోహన్‌ను తంగళ్లపల్లి మండల కురుమ సంఘ సభ్యులు కలిశారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. వీరిలో అధ్యక్షుడు ఎగుర్ల కరుణాకర్, కనకరాజు, ఎగుర్ల ప్రశాంత్, గుంటి అరవింద్ తదితరున్నారు.

నవాజ్ కుటుంబానికి పరామర్శ

బీఆర్ఎస్‌వీ మండలాధ్యక్షుడు నవాజ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు

ముస్తాబాద్, సెప్టెంబర్ 24 : మండల కేంద్రంలో బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు ఎండీ నవాజ్ తాత ఎండీ నజీర్ వారం రోజుల రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందగా వారి కుటుంబాన్ని మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు పరామర్శించారు. మంగళవారం వారి స్వగృహంలో కుటుంబ సభ్యులతో వివరాలు తెలుసుకొని ఓదార్చి, మనోధైర్యాన్ని కల్పించారు. అనంతరం పోతుగల్‌లో రిటైర్డు ఎంఈవో బత్తిని పరశురాములుగౌడ్ అనారోగ్యంతో ఆదివారం మరణించగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆ కుటుంబాన్ని ఓదార్చారు. మాజీ ఎంపీపీతోపాటు యూత్ అధ్యక్షుడు శీలం స్వామి, పారిపెల్లి శ్రీనివాస్, గ్రామాధ్యక్షుడు బాల్‌నర్సు, శంకర్, వెంకన్న,సోషల్‌మీడియా వారియార్ నందు, ఎండీ జాంగీర్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు శివాని ఎంపిక

విద్యార్థిని శివానికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయులు

కోనరావుపేట, సెప్టెంబర్ 24: నిజామాబాద్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మానుక శివాని సిరిసిల్లలో జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో మొదటి స్థానం సాధించింది. దీంతో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థి శివానిని ప్రధానోపాధ్యాయులు ఎండీ షాబుద్దీన్, ఫిజికల్ డైరెక్టర్ సుంకటి అజయ్, ఉపాధ్యాయులు అభినందించారు.

అడవి పందుల దాడిలో పంటలు ధ్వంసం

ధర్మారంలో ధ్వంసమై వరి పంటను చూపుతున్న రైతు

కోనరావుపేట, సెప్టెంబర్ 24: ధర్మారం గ్రామంలో రైతు బొడ్డు శంకర్‌కు చెందిన వరి పంటతోపాటు బొడ్డు ప్రభాకర్, మల్లవేణి తిరుపతి ల పత్తి పంటలను అడవి పందులు ధ్వంసం చేశాయి. పంట చేతికొచ్చే సమయంలో రాత్రి సమయాన గుంపులుగా చొరబడి పంటను పూర్తిగా ధ్వంసం చేశాయని రైతులు వాపోయారు. దెబ్బతిన్న పంటలను అటవీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపరిహారం అందిచాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల మానసిక ప్రవర్తనను గమనించాలి

- సైకాలజిస్టు డాక్టర్ ప్రవీణ్

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్టు డాక్టర్ ప్రవీణ్

వీర్నపల్లి, సెప్టెంబర్ 24: విద్యాబోధనతోపాటు విద్యార్థుల మానసిక ప్రవర్తనను ఉపాధ్యాయినులు గమనిస్తుండాలని సైకాలజిస్టు డాక్టర్ ప్రవీణ్ సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇటీవల ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 21న 'ఒత్తిడి తట్టుకోలేకనే' అనే శీర్షిక నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితం కాగా, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పందించారు. అదేరోజు పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. మానసిక వైద్యులతో విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇప్పిస్తామని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో మానసిక వైద్య నిపుణుల బృందం మంగళవారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మానసికంగా ఎలా ధృడంగా ఉండాలో వివరించారు. ఇక్కడ ఇన్‌చార్జి వైద్యాధికారి చిరంజీవి, ఎస్‌వో లింగమ్మ, ఎంసీహెచ్‌పీ వైతన్య, ఏఎన్ఎం సుజాత, తదితరులున్నారు.

విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం

ముస్తాబాద్, సెప్టెంబర్ 24 : మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం గౌరవాధ్యక్షుడు రుద్రోజు రమేశ్, అధ్యక్షుడు విశ్వనాథుల బాలస్వామి ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక వర్గం కుటుంబ సభ్యులకు వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చింతోజు రాజారాంను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మారేపు అశోక్, ప్రధాన కార్యదర్శి కొడిమెల స్వామి, కోశాధికారి కొత్తపల్లి నారాయణచారి, లక్ష్మీనారాయణ, శంకర్ పాల్గొన్నారు.

మిగిలిపోయిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

బోయినపల్లి, సెప్టెంబర్ 24: బోయినపల్లి మోడల్ స్కూల్‌లో మిగిలిపోయి ఖాళీగా ఉన్న సీట్లకోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ రఘునాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ కాలేజీలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో మెదటి సంవత్సరానికి ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 30లోపు కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ రఘునాథ్ తెలిపారు. ఆ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.